సాక్షి కామారెడ్డి

మంగళవారం । 30 । జనవరి । 2024



ప్రజావాణిలో 68 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 68 ఫిర్యాదులు నమోదయ్యాయి. డీఆర్‌డీవో ఫిర్యాదులు స్వీకరించారు.

- 8లో ▸



అభివృద్ధికి పెద్దపీట

సంక్షేమ పథకాల అమలుతోపాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
31.4 / 13.3

వాతావరణం

ఉదయం చలిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

3న జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్

బాన్సువాడ: బాన్సువాడలో వచ్చే నెల 3న జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ సోషల్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసూన్‌కుమార్, నూతిపల్లి బాల్‌రాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, గురుకుల పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న వారు ఈ సోషల్ టాలెంట్ టెస్ట్‌కు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తమ తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపే విద్యార్థులు రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌కు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 90599 09098, 94905 11153 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు రాష్ట్ర స్థాయి గణిత ప్రతిభా పరీక్ష



కామారెడ్డి టౌన్: డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం రాష్ట్ర స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాస్థాయి పోటీలలో అర్హత సాధించినవారు రాష్ట్ర స్థాయి ప్రతిభా పరీక్షకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి రామారావు, ఆర్థిక కార్యదర్శి నరేందర్, ప్రతినిధులు కుమారస్వామి, రామకృష్ణ, భిక్షపతి, సిద్దిరాంగౌడ్, శివప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

3న జిల్లాస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో వచ్చేనెల 3వ తేదీన జిల్లాస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–8, 12, 14 బాలబాలికల విభాగాలలో పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, స్టాండింగ్ బోర్డు జంప్ పోటీలుంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం తీసుకుని ఈనెల 3న ఉదయం 8 గంటలకు ఇందిరా గాంధీ స్టేడియానికి రావాలని సూచించారు.

'పోచారం' నుంచి రెండోవిడత నీటివిడుదల



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నుంచి సోమవారం రెండోవిడత నీటిని విడుదలను ప్రారంభించారు. ప్రాజెక్టు నుంచి 200 క్యూసెక్కుల చొప్పున ప్రధాన కాలువలోకి వదులుతున్నారు. ఆయకట్టు పంటల అవసరాలకోసం పదిహేను రోజులపాటు నీటిని విడుదల చేయనున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు.


మైనారిటీ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని మైనారిటీ గురుకుల విద్యాసంస్థల్లో ప్రవేశాలకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మైనారిటీ పాఠశాలలు, కళాశాలల్లో 64 శాతం ముస్లిం, 7 శాతం క్రిస్టియన్, 4 శాతం జైన, పార్సి, బుద్ధ, సిక్కు మతాల వారికి, 6 శాతం ఎస్సీలు, 4 శాతం ఎస్టీలు, 12 శాతం బీసీలు, 3 శాతం ఓసీలకు రిజర్వేషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకోసం 99122 44005, 040–23437909 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నిజామాబాద్‌అర్బన్: పదోతరగతి తత్కాల్ పరీక్ష ఫీజు గడువు పొడిగించినట్లు డీఈవో దుర్గాప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 6 తేదీ వరకు తత్కాల్ ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. రెగ్యులర్ పరీక్షకు ఫీజు చెల్లించిన వారే.. సప్లిమెంటరీ పరీక్షలకు అర్హులని తెలిపారు. గడువులోపు ఫీజు చెల్లించాలని సూచించారు.

గాడి తప్పిన వైద్య శాఖ!



దేవునిపల్లి పీహెచ్‌సీలో వైద్యుల దుమ్మాపై విచారణ జరుపుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్(ఫైల్)

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పాలన గాడి తప్పింది. సర్కారు దవాఖానాల్లో వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు డాక్టర్లు యథేచ్ఛగా విధులకు దుమ్మా కొడుతున్నారు. డీఎంహెచ్‌వోపై పలు అవినీతి ఆరోపణలున్నా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- సర్కారు దవాఖానాలపై పర్యవేక్షణ కరువు
- డ్యూటీలకు యథేచ్ఛగా డుమ్మా కొడుతున్న వైద్యులు
- సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది
- డీఎంహెచ్‌వోపై అవినీతి ఆరోపణలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు

కామారెడ్డి టౌన్ : వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జిల్లాలో 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. చాలా ఆస్పత్రులలో వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. విధులకు దుమ్మా కొడుతున్నవారు.. హాజరు రిజిస్టర్లలో మాత్రం సంతకాలు చేస్తున్నారు. ఈనెల 10, 11 తేదీలలో దేవునిపల్లి పీహెచ్‌సీలో ఓ డాక్టర్ విధులకు దుమ్మా కొట్టి రిజిస్టర్‌లో మాత్రం సంతకాలు చేశారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లడంతో.. ఆయన వెంటనే విచారణ చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌ను ఆదేశించారు. ఆయన పీహెచ్‌సీకి వస్తున్నారని సమాచారం అందడంతో అక్కడి సిబ్బంది రిజిస్టర్‌లో గ్రీన్ పెన్‌తో ఆ రెండు రోజులు సీఎల్‌గా మార్చారు. ఇది వివాదాస్పదమైంది. సదరు వైద్యురాలు ఇలాగే విధులకు దుమ్మా కొడుతున్నట్లు విచారణలో తేలింది. విచారణ పూర్తై పదిహేను రోజులు గడిచినా సదరు వైద్యురాలిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్లతోనే సదరు దుమ్మా డాక్టర్‌పై చర్యలు తీసుకోవడం లేదని సమాచారం. చర్యలు తీసుకుంటే డీఎంహెచ్‌వో చేసిన అవినీతి, అక్రమాలను బయటపెడతామని బెదిరించినట్లు తెలుస్తోంది. అందుకే చర్యలు తీసుకోవడం లేదని ప్రచారం జరుగుతోంది. కాగా ఈ వివాదాన్ని వదిలేయండంటూ డీఎంహెచ్‌వో మీడియా ప్రతినిధులను కోరడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

అన్నిచోట్లా ఇదే తీరు..

జిల్లాలోని దాదాపు అన్ని సర్కారు దవాఖానాల్లో ఇదే పరిస్థితి ఉంది. చాలాచోట్ల వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించడం లేదన్న విమర్శలున్నాయి. జిల్లాలో 11 పీహెచ్‌సీలు మినహా మిగతావన్నీ 24 గంటల వైద్య సేవలు అందించే అస్పత్రులే.. అయితే ఎక్కడ కూడా సరైన వైద్య సేవలు అందడం లేదు. చాలాచోట్ల వైద్యులు సమయానికి రావడం లేదని, ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారని ఆరోపణలున్నాయి. ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలే వైద్య సేవలు అందిస్తున్నారు. చాలా పీహెచ్‌సీల్లో అసలు ప్రసవాలే జరగడం లేవు. పీహెచ్‌సీలలో రాత్రి వేళల్లో వైద్య సేవలే అందడం లేదు. నామమాత్రంగా ఓపీ సేవలు అందిస్తున్నా.. ఆన్‌లైన్‌లో మాత్రం వందల మందిని చూసినట్లు తప్పుడు వివరాలు నమోదు చేస్తుండడం గమనార్హం. సర్కారు దవాఖానాల్లో వైద్య సేవలు, వైద్యుల దుమ్మా అంశంపై గత జిల్లా పరిషత్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు ఈ అంశాన్ని ప్రస్తావించారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు.

జిల్లా వైద్యాధికారిపై ఆరోపణలెన్నో..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిపై ఎన్నో అవినీతి ఆరోపణలున్నాయి. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీలో రూ. 30 వేలనుంచి రూ. 2 లక్షల వరకు డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. డబ్బులిస్తేనే ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్, ఎక్స్‌రే సెంటర్‌ల రిజిస్ట్రేషన్‌లు, రెన్యువల్ చేస్తున్నారని ఆస్పత్రులు, ఆయా సెంటర్ల నిర్వాహకులు బహిరంగంగానే మాట్లాడుకుంటుండడం గమనార్హం. ఇటీవల నిజాంసాగర్ రోడ్‌లో ఉన్న ఓ ట్రస్టుకు చెందిన ప్రైవేట్ ఆస్పత్రి రిజిస్ట్రేషన్ రెన్యువల్ కోసం దరఖాస్తు చేయగా.. డబ్బులు ఇవ్వలేదన్న కారణంతో నెల రోజులుగా ఆ ఫైల్‌ను పెండింగ్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. ఆయుష్ వైద్యుల నియామకంతో పాటు ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సుల నియామకంలో సదరు వైద్యాధికారి డబ్బులు డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన ఫోన్ కాల్ రికార్డ్స్, యూపీఐ లావాదేవీల సాక్ష్యాలున్నాయి. దీనిపై గతంలో కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సాక్ష్యలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆరోపణలపై అదనపు కలెక్టర్ విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వగా.. ఆయన డీఎంహెచ్‌వోను మందలించి వదిలివేసినట్లు తెలిసింది. అవినీతి ఆరోపణలకు తోడు దుమ్మా డాక్టర్‌పై చర్యల విషయంలో రాజకీయ ఒత్తిళ్లు పెరిగిపోతుండడంతో జిల్లా వైద్యాధికారి బదిలీకోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఆయన గతంలో పనిచేసిన ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే ద్వారా ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు సమాచారం.



దేవునిపల్లి పీహెచ్‌సీలో వైద్యులు లేక ఖాళీగా ఉన్న కుర్చీ (ఫైల్)

మళ్లీ మోదీనే ప్రధానమంత్రి

- జహీరాబాద్ నియోజకవర్గంలోనూ కాషాయ జెండా ఎగరేస్తాం
- బీజేపీ నాయకుడు జైపాల్‌రెడ్డి



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

ఎల్లారెడ్డి: వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో గెలిచి, హ్యాట్రిక్ పీఎంగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి నేత జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన ఎల్లారెడ్డిలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిందన్నారు. అన్ని రంగాలలో దేశాన్ని నంబర్‌వన్‌గా నిలపాలన్న లక్ష్యంతో మోదీ పనిచేస్తున్నారన్నారు. ప్రస్తుతం దేశంలో బీజేపీకి అనుకూల పవనాలు బాగా ఉన్నాయన్నారు. రామ మందిర నిర్మాణంతో ప్రజలలో నమ్మకం మరింత పెరిగిందన్నారు. వచ్చే ఎన్నికలలో తమ పార్టీ 400 లకుపైగా సీట్లను గెలుచుకుంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. జహీరాబాద్ నియోజకవర్గంలోనూ కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. తన తండ్రి బాగారెడ్డి ఏడుసార్లు ఎమ్మెల్యేగా, నాలుగుసార్లు ఎంపీగా గెలిచి జహీరాబాద్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. తాను సైతం రెండుసార్లు డీసీసీబీ చైర్మెన్‌గా ప్రజలకు సేవ చేశానన్నారు. పార్టీ ఆదేశిస్తే జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. తనకే సీటు కేటాయించే అవకాశాలున్నాయన్నారు. పార్టీ అధిష్టానం ఎవరికి అవకాశమిచ్చినా బీజేపీ గెలవడం తథ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివాజీ పటేల్, బుచ్చిరెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటుదాం



జుక్కల్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా దక్కకుండా చేద్దాం
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నిజాంసాగర్: త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలలో జహీరాబాద్ స్థానంలో తిరిగి గులాబీ జెండా ఎగిరేందుకు కృషి చేయాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. పిట్లం మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో సోమవారం జుక్కల్ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోసపూరిత, అసత్య వాగ్దానాలతో గెలిచారన్నారు. వారి మాటలను నమ్మిన ప్రజలు మోసపోయారన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో లేకపోయినా కార్యకర్తలు, నాయకులు అధైర్యపడవద్దన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ రాష్ట్ర గొంతుక వినపడాలంటే బీఆర్ఎస్ ఎంపీలు ఉండాల్సిందేనన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకోసం శ్రమించాలని, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు డిపాజిట్లు దక్కకుండా చూడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సొసైటీల చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగ్గురు వైద్యుల రాజీనామా

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఐసీయూ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు వైద్యులు తమ ఉద్యోగానికి రాజీనామా చేశారు. అనస్థీషియా వైద్యురాలు శిల్ప, ఎండీ ఫిజీషియన్ సాయిలు, పల్మనాలజిస్ట్ ప్రవీణ్ సోమవారం తమ రాజీనామాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మికి అందించారు.

జిల్లాలో నూతన వైద్య కళాశాల ప్రారంభం కావడంతో వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఉన్న జిల్లా కేంద్ర ఆస్పత్రిని 8 నెలల క్రితం డీఎంఈ అధీనంలోకి తీసుకుంది. టీవీవీపీ పరిధిలో ఉన్నప్పుడు ఐసీయూలో విధులు నిర్వహిస్తున్న ఈ వైద్యుల వేతనం రూ. లక్షకుపైగా ఉండేది. ప్రస్తుతం ప్రతి నెలా రూ. 52 వేలు మాత్రమే చెల్లిస్తామని డీఎంఈ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో రాజీనామా చేసినట్లు వైద్యులు తెలిపారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు తెలిపినా స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

'కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి'

నస్రుల్లాబాద్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గడపగడపకు తీసుకువెళ్లాలని, ఆయా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార సూచించారు. గావ్ చలో కార్యక్రమంలో భాగంగా సోమవారం నస్రుల్లాబాద్ మండలకేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వ విజయాలను, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా మరోసారి ఎన్నికైన అరుణతారను పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సున్నం సాయిలు, జిల్లా అధికార ప్రతినిధి చందూరి హన్మండ్లు, నాయకులు పైడిమల్ లక్ష్మీనారాయణ, మేకల రాములు, గంగాధర్ గుప్తా, వడ్ల సతీష్, పెర్క రాములు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అరుణతారను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పాల బిల్లుల కోసం పాడి రైతుల రాస్తారోకో

తాడ్వాయి: ఎర్రాపహాడ్ శివారులోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై సోమవారం పాడి రైతులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ విజయ డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు 45 రోజుల నుంచి బిల్లులు రావడం లేదన్నారు. గ్రామానికి రూ. లక్ష వరకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. డబ్బులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పాడిపశువుల కొనుగోలుకు బ్యాంకులలో తీసుకున్న రుణాన్ని చెల్లించలేకపోతున్నామన్నారు. లీటర్‌కు ఇచ్చే నాలుగు రూపాయల ఇన్సెంటివ్ కూడా మూడేళ్లుగా రావడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించేలా చూడాలన్నారు. అలాగే సబ్సిడీపై నాణ్యమైన దాణా, మినరల్ మిక్చర్, కాల్షియం, గడ్డివిత్తనాలను సరఫరా చేయాలని కోరారు. పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులను బుజ్జగించడానికి ప్రయత్నించారు. డెయిరీ మేనేజర్ వచ్చి సమాధానం ఇచ్చేంతవరకు ఆందోళన విరమించేది లేదని చెప్పడంతో పోలీసులు డెయిరీ మేనేజరు శ్రీకాంత్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి రైతులతో మాట్లాడారు. డిసెంబర్ నెలకు సంబంధించిన పాల బిల్లులను రెండు రోజుల్లో బ్యాంకులలో జమ చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



రాస్తారోకో చేస్తున్న పాడిరైతులు

ఎన్డీఎస్ఎల్ పునఃప్రారంభానికి కసరత్తు

- సాధ్యాసాధ్యాల పరిశీలనకు కమిటీ వేసిన ప్రభుత్వం
- రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం
- కార్మికులు, చెరుకు రైతుల్లో చిగురిస్తున్న ఆశలు



బోధన్ : నిజాం షుగర్స్ పునఃప్రారంభానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మూతపడిన నిజాంషుగర్ ఫ్యాక్టరీల ప్రారంభానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య ఉన్నత శాఖ అధికారులతో కమిటీ వేసింది. ఈ విషయాన్ని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఇటీవల నియోజకవర్గం పరిధిలోని హున్సా గ్రామ పర్యటనలో వెల్లడించారు. ఈ నెల 12న కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి క్షేత్రస్థాయిలో స్థితిగతులు పరిశీలించి రెండు నెలల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని జీవోలో పేర్కొన్నారు. దీని కోసం డైరెక్టర్ ఆఫ్ షుగర్ అండ్ కేన్ కమిషనర్, నిజాంషుగర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తక్షణమే చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించింది. మూతబడిన నిజాంషుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ క్రమంలో ఫ్యాక్టరీల పునఃప్రారంభానికి కమిటీ ఏర్పాటు చేసి తొలి అడుగు వేసిందని చెప్పవచ్చు. దీంతో ఫ్యాక్టరీ కార్మికులు, చెరుకు రైతుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

మూతపడి ఎనిమిదేళ్లు

బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీని 1938లో నిజాం కాలంలో నెలకొల్పారు. ఈ ఫ్యాక్టరీ దశాబ్దాలుగా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించింది. చెరుకు రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహదపడింది. రాష్ట్రవ్యాప్తంగా షుగర్ ఫ్యాక్టరీల విస్తరణకు దోహదపడింది. 2002లో చంద్రబాబు హయాంలో బోధన్, ముత్యంపేట(జగిత్యాల), ముంబోజిపల్లి (మెదక్) ఫ్యాక్టరీలను ప్రైవేట్‌పరం చేశారు. దీంతో ఎన్‌డీఎస్ఎల్(నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్)గా రూపాంతరం చెందింది. ఈ మూడు ఫ్యాక్టరీలను 2015 డిసెంబర్ 23న లేఆఫ్ ప్రకటించి మూసివేశారు.

కమిటీ సభ్యులు వీరే..

కమిటీ చైర్మన్‌గా రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కో చైర్మన్‌గా రాష్ట్ర వైద్యారోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ, సభ్యులుగా ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి, పరిశ్రమల, వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ షుగర్ అండ్ కేన్ కమిషనర్ (నిజాంషుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్) ఉన్నారు.

ఒకరి సజీవ దహనం

- పాత కక్షలతో మంటల్లో తోసివేత
- నెట్టేసిన వ్యక్తినే పట్టుకున్న బాధితుడు
- మృత్యువాత పడ్డ తోసిన వ్యక్తి
- బాధితుడికి తీవ్రగాయాలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ జయరాం, ట్రెయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, సీఐ నరహరి

ఖలీల్‌వాడి: పాత కక్షలతో జరిగిన గొడవలో ఒకరు సజీవ దహనం కాగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. నగరంలోని ఖిల్లా రోడ్డులోని ఓ పాడుబడిన భవనంలో ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. హష్మి కాలనీకి చెందిన షేక్ ముఖీత్(24), షేక్ హైమద్‌కు గొడవలున్నాయి. సోమవారం మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో వీరిద్దరితో పాటు మరో ఇద్దరు పాడుబడిన భవనంలో మంట వేసుకుని మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలో షేక్ ముఖీత్, షేక్ హైమద్‌కు మాటామాటా పెరిగింది. హైమద్‌ను ముఖీత్ మంటల్లోకి తోసేశాడు. మంటలు అంటుకున్న హైమద్ వెంటనే ముఖీత్‌ను పట్టుకున్నాడు. ఈ మంటల్లో ముఖీత్ అక్కడికక్కడే సజీవ దహనమయ్యాడు. హైమద్ తీవ్రంగా గాయపడ్డాడు. భవనం నుంచి అరుపులు వినిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన అహ్మద్‌ను జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. సీపీ కల్మేశ్వర్, డీసీపీ జయరాం, ట్రెయినీ ఐపీఎస్ చైతన్య రెడ్డి, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ నరహరి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. షేక్‌అహ్మద్ భార్య షేక్ సనా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పాడుబడిన భవనం చుట్టు పక్కల గల సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు.

క్లుప్తంగా

పీఎస్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



సదాశివనగర్: మండలంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పీఎస్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలు, ఆత్మహత్యలు, హత్యలపై ఆరా తీశారు. ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. డీఎస్పీ వెంట ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'రోటరీ' ఆధ్వర్యంలో సన్మానం

కామారెడ్డి అర్బన్: వివిధ రంగాల్లో విశేషకృషి చేసిన కామారెడ్డి ప్రాంత వ్యక్తులకు రోటరీ క్లబ్ అవార్డులను ప్రదానం చేసింది. వ్యవసాయంలో లొంక గోపాల్‌రెడ్డి, సామాజిక రంగంలో చింతల పోశవ్వ, అటవీశాఖ అధికారి శంకర్, హాస్టల్ వెల్ఫేర్ అధికారిణి డి.సరిత, ఆర్టీసీ డ్రైవర్ ఎం.పరంధామ్, మహిళా కానిస్టేబుల్ వెంకటలక్ష్మి, మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు హంస, క్యాతం వెంకటిని సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. రోటరీ గవర్నర్ బి.శంకర్‌రెడ్డి, కామారెడ్డి శాఖ అధ్యక్షుడు పి.సత్యం, కార్యదర్శి రాజనర్సింహారెడ్డి, కోశాధికారి సుధాకర్, ప్రతినిధులు డాక్టర్ విజయ్‌కుమార్, ధనుంజయ, డాక్టర్ బాలరాజు, కే.కాశీనాథం, బాలకిషన్, గంగారెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుభద్రతపై అవగాహన



పెద్దకొడప్‌గల్(జుక్కల్): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పోలీస్ కానిస్టేబుల్ సాయిశివ సూచించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతామాసోత్సవాలు సోమవారం నిర్వహించారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది అంజి, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 68 ఫిర్యాదులు

- వినతులు స్వీకరించిన డీఆర్డీవో

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 68 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 38 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవి కావడం గమనార్హం. మరో 11 ఫిర్యాదులు జిల్లా పంచాయితీ అధికారి కార్యాలయానికి, మిగితావి ఆయా శాఖలకు చెందిన ఫిర్యాదులున్నాయి. డీఆర్డీవో సాయన్న, సూపరింటెండెంట్ సాయిభుజంగరావు ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీఆర్డీవో సాయన్న

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా కమిటీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.7,800 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న చార్జీలను వెంటనే విడుదల చేయాన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలు, హాస్టళ్లకు వెంటనే నూతన భవనాలు మంజూరు చేయాలన్నారు. వ్యవసాయ యూనివర్సిటీలో హైకోర్టు ఏర్పాటుకు సంబంధించిన 55 జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరీక్ష రాయించి భవిష్యత్‌ను కాపాడండి



తనకు రెండు చేతులూ లేవని, పరీక్ష రాయించి తన భవిష్యత్‌ను కాపాడాలని లింగంపేట మండలం రాంపల్లి గ్రామానికి చెందిన సాయిబాబా అనే విద్యార్థి ప్రజావాణిలో విన్నవించాడు. అయిలాపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదుతున్న సాయిబాబాకు పుట్టుకతోనే రెండు చేతులు లేవు. పరీక్షలు రాయాలంటే సహాయకుడి అవసరం తప్పనిసరి. పరీక్షల్లో ఒక సబ్జెక్టు మినహాయింపు, సహాయకుని కేటాయింపు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అతనికి తన వైకల్యానికి సంబంధించిన సదరం సర్టిఫికేట్ ఉంది. కానీ అందులో వైద్యుని సంతకం లేదు. సదరం సర్టిఫికేట్‌లో వైద్యుని సంతకం లేనిదే సైకర్యాలు కల్పించడం కుదరదని విద్యాశాఖ అధికారులు తేల్చి చెప్పారు. వైద్యుని సంతకం చేయించి భవిష్యత్‌ను కాపాడాలని సాయిబాబా అధికారులను కోరాడు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి సమీపంలోని వ్యవసాయ భూమిలో విద్యుత్ తీగలు చేతికి అందేలా కిందికి వేలాడుతుండడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ పొలంలోని విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ప్రతిరోజూ ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై వ్యవసాయ భూముల్లోకి వెళ్తుంటారు.

ఆ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కోడిచిర శివారులోని వ్యవసాయ భూమిలో విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన విషయం తెలిసిందే.



చేతికి అందేలా ఉన్న విద్యుత్‌తీగలు

అయోధ్యకు తరలిన భక్తులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్‌కు చెందిన పలువురు అయోధ్యకు వెళ్లారు. బయల్దేరారు. ప్రత్యే వాహనంలో వెళ్లిన వారు బాలరాముడిని దర్శించుకోనున్నారు.

సెల్ ఫోన్లు అప్పగింత



రామారెడ్డి(ఎల్లారెడ్డి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ ప్రక్రియ ద్వారా ట్రేస్ చేసి స్వాదీనం చేసుకొని బాధితులకు రామారెడ్డి ఎస్సై సుధాకర్ సోమవారం అందజేశారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే ఐఎంఈఆర్ నంబర్ తీసుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఫోన్లను గుర్తించవచ్చన్నారు. ముగ్గురు బాధితులకు ఫోన్లను అందజేశారు.

డబ్బులు రికవరీ చేయాలి

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో ఉన్న వీరహనుమాన్, వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ గదులు నిర్మించి వాటిని వాడుకున్న వారి నుంచి డబ్బులు రికవరీ చేయాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సకాలంలో స్పందించి షాపింగ్ కాంప్లెక్స్ గదులను స్వాధీనం చేసుకున్న దేవాదాయ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నౌసీలాల్, నాయకులు బ్రహ్మానందరెడ్డి, భాస్కర్‌గౌడ్, బన్సీలాల్, నవీన్‌గౌడ్, రాజు, శ్రీనివాస్, రమేశ్, బాల్‌నర్సాగౌడ్, సతీశ్, అర్షద్, సాదిక్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యానికి రెక్కలు

బాన్సువాడ రూరల్: రేషన్ బియ్యం దందా బాన్సువాడ సబ్‌డివిజన్‌లో మూడుపూలు.. ఆరు కాయలుగా కొనసాగుతోంది. ఓవైపు రైస్‌మిల్లర్లు, మరోవైపు రేషన్‌డీలర్లు పేదవాడి బియ్యాన్ని పక్కదారి పట్టించి జేబులు నింపుకుంటున్నారు. బియ్యం రేషన్ షాపునకు చేరకుండానే మాయమవుతున్నాయి. ఈనెల 12న బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామంలో 6వనెంబర్ రేషన్‌షాపులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సత్యనారాయణ తనిఖీలు నిర్వహించి.. ఈ పాస్ యంత్రంలో స్టాక్‌ను గ్రౌండ్‌బ్యాలెన్స్‌తో సరిచూడగా, సుమారు 85 క్వింటాళ్ల స్టాకు తక్కువగా ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. అయితే.. రేషన్‌డీలర్ గంగాధర్‌పై అధికారులు షరా'మామూలు'గా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తదుపరి విచారణకు తావులేకుండా చేశారంటున్నారు. 85 క్వింటాళ్ల బియ్యం రైస్‌మిల్లుకు తరలించారా? ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి మాయమయ్యాయయా? లేదా మార్గమధ్యంలో దారి మళ్లించారా? అనే అంశాలనే విస్మరించారు. రేషన్ బియ్యం పక్కదారి విషయంలో ఎంఎల్ఎస్ పాయింట్ నిర్వాహకుల ప్రమేయం తదితర కోణాల్లో విచారణ చేపట్టకపోవడం వెనుక రూ.లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మాయమాటలు

రేషన్‌బియ్యం కోసం వచ్చే లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకుంటున్న పలువురు డీలర్లు బియ్యం తర్వాత తీసుకోమంటూ వెనక్కి పంపుతున్నారు. ఈసారి బియ్యం బాగాలేవు, రాళ్లున్నాయి, చెత్తాచెదారంతో వచ్చింది అంటూ మాయమాటలు చెబుతూ వెనక్కి పంపిస్తున్నారు. వచ్చేనెల సన్నబియ్యం వచ్చే అవకాశం ఉంది. అప్పుడు తీసుకోవాలంటూ రేషన్ బియ్యం అంతగా అవసరం లేని మధ్యతరగతి లబ్ధిదారులను మభ్యపెడుతున్నారు. ఇలా వందలాది మంది లబ్ధిదారులు 3నుంచి 6నెలల బియ్యం రేషన్‌డీలర్ల నుంచి తీసుకోవాల్సి ఉంది.



తాడ్కోల్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు(ఫైల్)

గట్టిగా ప్రశ్నిస్తే బియ్యానికి బదులు నగదు

విసిగివేసారి ఎవరైన లబ్ధిదారుడు గట్టిగా ప్రశ్నిస్తే బకాయి పడిన బియ్యం ఇవ్వడమో, క్వింటాలుకు రూ.వెయ్యినుంచి 12వందలు ధరకట్టి నగదు ఇవ్వడమో జరుగుతోంది. ఈ దందా ప్రతి గ్రామంలోనూ కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయీస్ అధికారులు సమగ్ర విచారణ చేపడితే చాలామంది డీలర్ల బాగోతం బయట పడుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

రాష్ట్రస్థాయి అబాకస్‌కు ఎంపిక

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని న్యూ ఆదర్శ్ స్కూల్‌కి చెందిన వడ్డెవార్ సాయి సంస్కృతి అబాకస్‌లో రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గత రెండు రోజులక్రితం జిల్లా స్థాయి అబాకస్‌కు తమ పాఠశాలకు చెందిన సాయిసంస్కృతి, యాత్ర హాజరైనట్లు తెలిపారు. సాయిసంస్కృతి రాష్ట్రస్థాయికి ఎంపికాగా, యాత్ర బెస్ట్‌ఫర్‌ఫార్మర్‌గా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



ఫిబ్రవరి 25వ తేదీన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలు ఉంటాయని ప్రిన్సిపల్ తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 2022–23 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నేషనల్ హైవే ఆధ్వర్యంలో సోమవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. శివప్రసాద్, చందన నగదు ప్రోత్సాహకాలు అందుకోగా, ఉపాధ్యాయులు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రకాంత్, కిషన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న అధికారులు

గడికోటను సందర్శించిన విదేశీయులు



దోమకొండ: మండల కేంద్రంలోని గడికోటను సోమవారం అమెరికావాసులు సందర్శించారు. ట్రస్ట్ ప్రతినిధులతో మాట్లాడారు. గడికోట ట్రస్టు విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను తెలుసుకున్నారు. మహిళలు తయారు చేసిన పలు రకాల వస్తువులను పరిశీలించారు. 2016 నుంచి 2024 వరకు గడికోట ట్రస్టు తరపున చేపట్టిన పనులను ట్రస్టు మేనేజర్ బాబ్జీ వారికి వివరించారు. మహిళల ప్రత్యామ్నాయ ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అమెరికావాసులు అజ్మెట్‌జాన్, నాజీజాన్, శేఖర్‌జాన్‌లతో పాటు గడికోట వారసులు కామినేని అనిల్‌కుమార్, అపోలో ఆస్పత్రుల డైరెక్టర్ కామినేని శోభన, ట్రస్టు ప్రతినిధులు ఉన్నారు.

విరాళాల సేకరణ

భిక్కనూరు: దేశ రాజధాని ఢిల్లీలో నిర్మించతలపెట్టిన వ్యవసాయకార్మిక సంఘం భవన నిర్మాణం కోసం మండల కేంద్రంలో వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో ప్రజావిరాళాలను సేకరించారు. సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకట్‌రాములు, సహాయకార్యదర్శి పద్మ, జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు, నేతలు పేరం నర్సవ్వ, చంద్రకళ, అర్జున్, నారాయణ, శ్యామల, జయలక్ష్మి పాల్గొన్నారు.

బోధన్‌లో కత్తిపోట్ల కలకలం

బోధన్‌టౌన్: పట్టణంలోని ఆచన్‌పల్లి కాలనీలో సోమవారం రాత్రి ఇద్దరి యువకుల మధ్య జరిగిన కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. సీఐ వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆచన్‌పల్లి కాలనీ చెందిన షోయేబ్, వాసేలు ఇద్దరు మిత్రులు. షోయేబ్ తమ్ముడు సోహేల్, వాసే కసిన్ బ్రదర్స్ తన్వీర్, ఇల్యాస్ ఓ కాలనీలో కూర్చొని చిట్‌చాట్ చేస్తున్నారు. ఈ క్రమంలో షోయేబ్, వాసేల మధ్య చిన్న పాటి గొడవ జరిగింది. దీంతో వాసే కజిన్ బ్రదర్ ఇల్యాస్ కత్తితో షోయేబ్‌పై దాడికి దిగగా అక్కడే ఉన్న సోహేల్ అడ్డుగా రావడంతో కడుపులో తీవ్రగాయమైంది. ఇల్యాస్ కత్తితో మరోసారి దాడికి దిగగా ఈ సారి కజిన్ బ్రదర్ తన్వీర్‌కు కడుపులో గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కత్తిపోట్లకు గురైన ఇద్దరిని ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై విచారణ చేపడుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

క్రైం కార్నర్

పేకాట స్థావరంపై దాడి

తాడ్వాయి: మండలంలోని బ్రాహ్మణపల్లి శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి దాడి చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 7040 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

నస్రుల్లాబాద్: మండలంలోని దుర్కిలో గంజాయి పండించి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లావణ్య సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన సాయిలు తన పొలంలో గంజాయిని పండించి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడి నుంచి కేజీ 190 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వీటి విలువ రూ. 29,750 ఉంటుందన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మొరం టిప్పర్ల పట్టివేత



సదాశివనగర్: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి శివారులో అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్న జేసీబీ, టిప్పర్లను గ్రామస్తులు సోమవారం పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టకుండా చూడాలని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి జానకీజనార్దన్, ఎంపీటీసీ సంకరి లక్ష్మీరాజలింగం, సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురి బైండోవర్



కామారెడ్డి క్రైం: పట్టణంలోని పలు కాలనీల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ జనార్దన్ ఎదుట బైండోవర్ చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన ముప్పిల రాజేశ్వర్, కళ్లెం భగవాన్, రావుల రాజేశ్ అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు స్థానికుల ద్వారా గుర్తించినట్లు చెప్పారు. ఇలాగే ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

ఈతరాక విద్యార్థి మృతి



ఇందల్వాయి: చేపల కోసం సరదాకి చెరువులోకి దిగిన ఓ విద్యార్థి ఈత రాకపోవడంతో మునిగి మృతి చెందిన ఘటన మండలంలోని మేఘ్యానాయక్ తండాలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన నర్యాకి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడైన శ్రీనాథ్(16) ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. సోమవారం మేకలను కాసేందుకు స్నేహితులతో కలిసి నల్లవెల్లి శివారులోని తిరుమలయ్య చెరువులోకి వెళ్లాడు. చేపల కోసం సరదాకి చెరువులోకి దిగిన శ్రీనాథ్ ఈత రాక నీటిలో మునిగి గల్లంతయ్యాడు. గమనించిన స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై మహేశ్ రెస్క్యూ టీంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేశ్ తెలిపారు.

ముబారక్‌నగర్‌లో చోరీ

- పది తులాల బంగారం, నగదు అపహరణ

నిజామాబాద్‌రూరల్: రూరల్ పీఎస్ పరిధిలోని ముబారక్‌నగర్‌లో దుండగులు రెండిళ్లల్లో ఆదివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కస్తూరి గార్డెన్ కాలనీలో నివాసం ఉండే ధనలక్ష్మి తన తల్లి ఇటీవల మృతి చెందడంతో కుటుంబంతో కలిసి కంఠేశ్వర్‌లో ఉంటోంది. దుండగులు రాత్రి ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న 5 తులాల బంగారాన్ని దొంగిలించారు. ముబారక్‌నగర్ పరిధిలో ఉండే రాజగంగు ఇంట్లో సైతం దుండగులు చొరబడి 5 తులాల బంగారం, రూ.1.20 లక్షల నగదును అపహరించారు. ఒకే రోజు రెండిళ్లల్లో చోరీకి గురికావడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

కామారెడ్డిలో ముగ్గురి అరెస్ట్

కామారెడ్డి క్రైం: జిల్లాకు గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురు యువకులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన నెనావత్ గణేశ్, వరియోగుల సాయి నాందేడ్‌కు వెళ్లి అక్కడ ఆరిఫ్ అనే మరో యువకుడితో కలిసి 300 గ్రాముల గంజాయిని తీసుకొని సోమవారం కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో దిగారు. విశ్వసనీయ సమాచారం మేరకు ముగ్గురిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టణ పరిధిలోని యువత ఎవరైనా గంజాయి తాగడానికి అలవాటు పడితే గుర్తించాలని కోరారు. తమ దృష్టికి తీసుకొస్తే ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించి గంజాయిని మాన్పించే విధంగా ప్రయత్నిస్తామన్నారు. తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడిన యువకులు

కోడి పందాలు ఆడుతున్న ముగ్గురు..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న నర్సన్నపల్లిలో కోడి పందాలు ఆడుతున్న ముగ్గురిని దేవునిపల్లి పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గ్రామ శివారులో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్, దేవునిపల్లి పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో కోడి పందాలు ఆడుతున్న ముగ్గురు స్థానికులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.56,160 నగదు, 3 బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు, 2 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఉద్రిక్తతకు దారితీసిన సరిహద్దు వివాదం

వేల్పూర్: చాలా ఏళ్లుగా జాన్కంపేట్, పచ్చలనడ్కుడ గ్రామాల మధ్య కొనసాగుతున్న సరిహద్దు వివాదం సోమవారం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. వాగులో తమ సరిహద్దు చూయించాలని జాన్కంపేట్ గ్రామస్తులు చాలా రోజులుగా అధికారులను కోరుతూ వస్తున్నారు. అధికారులు వాగులో సరిహద్దు చూయించడం లేదంటూ జాన్కంపేట్ గ్రామస్తులు తమవైపు నుంచి వాగులోకి రహదారి వేసేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న పచ్చలనడ్కుడ గ్రామస్తులు రహదారి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. దీంతో ఇరుగ్రామాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. భీమ్‌గల్ సీఐ శ్రీనివాస్, వేల్పూర్ ఎస్సై వినయ్‌కుమార్, ప్రత్యేక పోలీసు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని శాంతి భద్రతలు అదుపు తప్పకుండా మోహరించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇరు గ్రామాలవారితో చర్చించారు. అధికారులు తమ సమస్యను పట్టించుకోవడం లేదంటూ జాన్కంపేట్ గ్రామస్తులు, రోడ్డుకోసం వచ్చిన ట్రాక్టర్లను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ నడ్కుడ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.



ఆందోళన నిర్వహిస్తున్న జాన్కంపేట్ గ్రామస్తులు

గ్రామస్తులతో అధికారుల చర్చలు

వేల్పూర్ మండలం జాన్కంపేట్, పచ్చలనడ్కుడ గ్రామాల మధ్య వాగు సరిహద్దు సమస్యపై ఆర్మూర్ ఏసీపీ జగదీశ్ చందర్, తహసీల్దార్ నాగార్జున సోమవారం రాత్రి జాన్కంపేట్ గ్రామస్తులతో చర్చించారు. రోడ్డుకోసం ఉపయోగించిన జాన్కంపేట్ ట్రాక్టర్లను సీజ్ చేయడానికి పోలీసులు ప్రయత్నించడంతో జాన్కంపేట్ మహిళలంతా ఏకమై అడ్డుకున్నారు. ఏసీపీ, తహసీల్దార్ చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. ట్రాక్టర్లను సీజ్ చేయకుండా జరిమానా విధించారు. దీంతో జాన్కంపేట్ మహిళలు శాంతించారు.

నల్లవెల్లిలో ఒకరి అదృశ్యం



ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లికి చెందిన కమ్మరి రవి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. ఆర్మూర్‌కు చెందిన రవి అత్తగారి గ్రామమైన నల్లవెల్లిలో కొన్నేళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసైనట్లు స్థానికులు తెలిపారు. పది రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన రవి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరోటౌన్ పీఎస్ పరిధిలో ఉన్న మౌలాలి దర్గా సమీపంలో ఉన్న చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రవీందర్ సోమవారం తెలిపారు. మృతి చెంది చాలా రోజులు కావడంతో మృతదేహం పూర్తిగా ఎముకలు తేలాయన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నిజామాబాద్‌రూరల్: గుండారం శివారులో ఉన్న కంకర క్రషర్‌లపై మైనింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కంకర నిల్వల పరిణామం, కొలతల్లో అవకవతవలు జరిగితే క్వారీల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వేనంబర్ 984లో ఉన్న క్వారీలను పరిశీలించి నిల్వలను తనిఖీలు చేశారు. శ్రీ సంబాజీ మాతా కంకర క్వారీ నిల్వలను పరిశీలించారు. గనుల శాఖ నుంచి తీసుకున్న పర్మిట్ పరిణామాలు ప్రస్తుత నిల్వలకు పత్రాలు చూపాలని షోకాజ్ నోటీసు జారీ చేశారు. పూర్తిగా వివరణ ఇవ్వకుంటే క్వారీపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పీజీ పరీక్షలకు 95 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ 3, 5, 7, 9వ సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం 4వ రోజు 95 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 1,699 మందికి 1,605 మంది హాజరు కాగా 94 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన 181 మందికి 180 మంది హాజరు కాగా ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు చెప్పారు. పరీక్షల్లో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ నమోదు కాలేదన్నారు.